www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

## తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్ జులై 22 (సిద్దిపేట పవర్):



తెలంగాణ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(TET) జూన్ సెషన్ ఫలితాలు విడుదలయ్యాయి. మంగళవారం ఉదయం ఎడ్యుకేషన్ సెక్రటరీ యోగితా రాణా ఫలితాలను విడుదల చేశారు. మొత్తం అభ్యర్థుల్లో 33.98 శాతం అర్హత సాధించారు.

జూన్ 18 నుంచి 30వ తేదీ మధ్య జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష ప్రాథమిక ఫలితాలు విడుదల జులై 5న విడుదలైన సంగతి తెలిసిందే. పేపర్ 1కు 63,261మంది, పేపర్2కు 1,20,392మంది దరఖాస్తు చేసుకోగా.. రెండు పేపర్లకు దరఖాస్తు చేసినవారు 15వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. పేపర్ 1 పరీక్షకు 74.65% హాజరుకాగా, పేపర్ 2 (గణితం, సైన్స్) పరీక్షకు 73.48% మంది, పేపర్ 2 (సామాజిక అధ్యయనాలు) పరీక్షకు 76.73% మంది హాజరయ్యారు.

సంపుటి: 01 | సంచిక: 124 | హైదరాబాద్ | బుధవారం | 23-07-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## సిందూర్‌తో పాటే బీసీ రిజర్వేషన్లు!

లోక్‌సభలో చర్చకు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరనున్న రాష్ట్ర ముఖ్య నాయకత్వం

బీసీ కోటాపై ఖర్గే, రాహుల్‌తో మరోసారి చర్చించే యోచన

24న పార్టీ ఎంపీలకు సీఎం రేవంత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్



## తెలంగాణ బేఖాతర్ ఏపీకి జీ హుజూర్!

### రెండు రాష్ట్రాలపై రెండు నాల్కలు

11 ఏండ్లుగా కేంద్రంలోని బీజేపీ సర్కారు తీరిదే

ఆది నుంచీ తెలంగాణ జలహక్కులపై ఉక్కుపాదం

పదేండ్లుగా డిమాండ్లు, ప్రతిపాదనలు బుట్టదాఖలు

ప్రాజెక్టులకు అనుమతులివ్వదు.. నిధులూ ఇవ్వదు

జలవివాదాలపై ఫిర్యాదులెన్ని చేసినా పట్టించుకోదు

172 లేఖలు రాసినా స్పందించని కేంద్ర ప్రభుత్వం

ఆంధ్రప్రదేశ్ విషయంలో అడిగిందే తడవుగా చర్యలు

వేగంగా అనుమతులు.. ఆగమేఘాలపై ఆదేశాలు

సీఎంల భేటీతో కేంద్రం ద్వంద్వవైఖరి బట్టబయలు

బాబు కోసమే 'బనకచర్ల'ను నెత్తినెత్తుకున్న కేంద్రం

నెల రోజుల్లోనే ప్రాజెక్టు క్లియరెన్స్‌కు రంగం సిద్ధం!



## ఈడీ దాడుల వెనుక ట్యాపింగ్ రాడార్!

కీలక మంత్రిపై ఈడీ రైడ్ వెనుక ఫోన్ ట్యాపింగ్

భవిష్యత్తు భయంతోనే ముఖ్యనేత నిఘా

లగ్జరీ రిస్ట్ వాచ్‌లు, మనీలాండరింగ్ ఉదంతాల్లో

సంభాషణలు గుట్టుగా విన్నట్టు అనుమానాలు

గత సెప్టెంబర్‌లో కీలక నేత, ఆయన బంధువుల ఇండ్లలో జరిగిన ఈడీ సోదాలు తాజాగా తెరపైకి!

యువ ఎమ్మెల్యే చేతికి కీలక భూమి పత్రాలు

దానికీ ట్యాపింగే కారణమంటున్న నేత సన్నిహితులు





## డెంగీ డేంజర్ బెల్స్..

రాష్ట్రవ్యాప్తంగా విజృంభిస్తున్న జ్వరాలు

జూన్‌లో 500మందికి పైగా బాధితులు

తీవ్ర ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు

నియంత్రణలో కాంగ్రెస్ సర్కారు విఫలం

జూన్‌లో 500మందికి పైగా బాధితులు

తీవ్ర ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు

నియంత్రణలో కాంగ్రెస్ సర్కారు విఫలం

## బీసీ రిజర్వేషన్లపై బీజేపీ తన గుణం బయటపెట్టింది

"బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యం".. పొన్నం ప్రభాకర్ స్పష్టం

బీజేపీ ఎంపీలకు మంత్రి సవాలు.. "రాజీనామా చేసి చూపించండి"

"సామాజిక న్యాయానికి కాంగ్రెస్‌నే మద్దతు".. బీసీ వర్గాలకు పిలుపు



## నితీశ్ కుమార్‌ను తప్పించడానికే ధన్‌ఖడ్ రాజీనామా: ఆర్జేడీ

సొంత పార్టీ నేతను సీఎం సీట్లో కూర్చోబెట్టాలని బీజేపీ భావిస్తోందని వ్యాఖ్య

అసెంబ్లీ ఎన్నికలకు ముందే ప్రణాళికతో ధన్‌ఖడ్‌తో రాజీనామా చేయించిందన్న ఆర్జేడీ

ఆర్జేడీ ఆరోపణలను ఖండించిన బీహార్ ఎన్డీయే నాయకులు





పదవీ విరమణపై

## పది రోజుల క్రితమే ధన్‌ఖడ్ కీలక వ్యాఖ్యలు

అనూహ్య రీతిలో ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన ధన్‌ఖడ్

ఆరోగ్య కారణాలను చూపుతూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజీనామా లేఖ

పదవీకాలం ముగియకముందే రాజీనామా చేయడంపట్ల పలువురు అనుమానాలు

ఇటీవల ఆయన పదవీ విరమణ గురించి మాట్లాడిన వీడియో నెట్టింట వైరల్

## ఫ్లైట్ మోడ్ సీఎం రేవంత్.. హాఫ్ సెంచరీ కొట్టారు..

రేవంత్ రెడ్డి ఫ్లైట్ మోడ్ సీఎం అని ఎద్దేవా

ఢిల్లీకి వెళ్లడంలో అర్ధ సెంచరీ సాధించారన్న కవిత

బీసీ రిజర్వేషన్లపై జాతీయ పార్టీలు మోసం చేస్తున్నాయని ఆగ్రహం



## హైదరాబాద్‌లో నకిలీ నోట్ల చలామణి.. ఇద్దరు యువకులు అరెస్ట్

మెహిదీపట్నం పోలీసుల దాడిలో నకిలీ కరెన్సీ బహిర్గతం

మహారాష్ట్రకు చెందిన అజీముద్దీన్, అదిల్ హుసేన్ అరెస్ట్

రూ.2 లక్షల నకిలీ నోట్లు స్వాధీనం..

ఆకాశ్ కోసం గాలింపు



## రైస్ మిల్లులో స్పిరిట్‌తో నకిలీ లిక్కర్ తయారీ గుట్టురట్టు

చీప్ లిక్కర్‌తో ప్రముఖ బ్రాండ్ల నకిలీ మద్యం తయారీ

వేల లీటర్ల నకిలీ మద్యం, లేబుల్స్ స్వాధీనం

గ్రామీణ షాపులకు నకిలీ మద్యం సరఫరా.. ఎక్సైజ్ దాడి



## తెలంగాణ కులగణన చరిత్రాత్మకం

ప్రభుత్వం బాధ్యతతో సోషియో ఎకనామిక్, పొలిటికల్, క్యాస్ట్ సర్వే చేసింది

తమ ప్రభుత్వం చేసిన సర్వే దేశంలోనే చారిత్రాత్మకంగా నిలబడుతుంది

పోస్ట్ క్యాస్ట్, ప్రీ క్యాస్ట్ సర్వే రిపోర్ట్ అసెంబ్లీలో పెట్టాం



## నితీశ్ కుమార్‌ను తప్పించడానికే
# ధన్‌ఖడ్ రాజీనామా: ఆర్జేడీ

- **సొంత పార్టీ నేతను సీఎం సీట్లో కూర్చోబెట్టాలని బీజేపీ భావిస్తోందని వ్యాఖ్య**
- **అసెంబ్లీ ఎన్నికలకు ముందే ప్రణాళికతో ధన్‌ఖడ్‌తో రాజీనామా చేయించిందన్న ఆర్జేడీ**
- **ఆర్జేడీ ఆరోపణలను ఖండించిన బీహార్ ఎన్డీయే నాయకులు**



**బీహార్ జూలై 22 (సిద్దిపేట పవర్):**

బీహార్‌లో నితీశ్ కుమార్‌ను తప్పించి సొంత పార్టీ నేతను ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టాలని బీజేపీ భావిస్తోందని, అందుకే జగదీప్ ధన్‌ఖడ్‌తో రాజీనామా చేయించిందని ఆర్జేడీ ఆరోపించింది. ఉపరాష్ట్రపతి పదవికి ధన్‌ఖడ్ నిన్న రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ రాజీనామాపై విపక్షాలు భిన్నంగా స్పందిస్తున్నాయి.

నితీశ్ కుమార్‌ను అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే మార్చడానికి వీలుగా ధన్‌ఖడ్‌తో రాజీనామా చేయించారని ఆర్జేడీ చీఫ్ విప్ అక్తారుల్ ఇస్లాం షాహిన్ అన్నారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఖాయం కావడంతో వారిలో నిరాశ పెరిగిపోయిందని అన్నారు. చాలా కాలం క్రితం ఒక సీనియర్ బీజేపీ నాయకుడు నితీశ్‌ను తప్పించేందుకు మద్దతు పలికారని గుర్తు చేశారు.

కేంద్ర మాజీ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే మరో అడుగు ముందుకేసి నితీశ్ కుమార్‌ను ఉపప్రధాని చేయాలని సూచించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ధన్‌ఖడ్ రాజీనామాలో బీజేపీ కుట్ర ఉందని తేలిందని వ్యాఖ్యానించారు. నితీశ్ కుమార్‌కు ఉప రాష్ట్రపతి వంటి అప్రధాన్య పోస్టు ఇచ్చి తప్పించాలని చూస్తోందని ఆరోపించారు.

అయితే, ఈ ఆరోపణలను బీహార్ రాష్ట్ర మంత్రి శ్రవణ్ కుమార్ తోసిపుచ్చారు. నితీశ్ కుమార్ బీహార్‌ను వీడబోరని స్పష్టం చేశారు. ఎన్డీయే కూటమిని విజయబాటలో నడిపించి బీహార్ ప్రజలకు సేవ చేస్తారని అన్నారు. నితీశ్ కుమార్ మరోసారి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు.

# సిందూర్‌తో పాటే బీసీ రిజర్వేషన్లు!

- **లోక్‌సభలో చర్చకు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరనున్న రాష్ట్ర ముఖ్య నాయకత్వం**
- **బీసీ కోటాపై ఖర్గే, రాహుల్‌తో మరోసారి చర్చించే యోచన**
- **24న పార్టీ ఎంపీలకు సీఎం రేవంత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

**హైదరాబాద్ జూలై 22 (సిద్దిపేట పవర్):**

లోక్‌సభ వర్షాకాల సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్ అంశంతో పాటు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదంపై చర్చించేలా పట్టు పట్టాలని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని తెలంగాణ ముఖ్య నాయకత్వం కోరనుంది. ఈ మేరకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడినట్టు తెలిసింది. హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సిన అనివార్యత, రిజర్వేషన్ల ఖరారుకు ఉన్న సమయం తదితర అంశాలపై హైకమాండ్‌తో మరోసారి మాట్లాడిన తర్వాత, బీసీ రిజర్వేషన్ల అంశంపై ఢిల్లీలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ (పీపీటీ) ఇవ్వాలనే నిర్ణయానికి రేవంత్ వచ్చారు.

ఈ నెల 24న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి వెళ్లి దేశంలోని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులందరికీ పీపీటీ ద్వారా బీసీ రిజర్వేషన్ల అంశాన్ని వివరించనున్నారు. అంతకంటే ముందు రాహుల్, ఖర్గేలతో ఇరువురు నేతలు ఈ అంశంపై చర్చించనున్నారు. రాహుల్‌గాంధీ ఆలోచనలకు, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ముందుకెళుతున్న తెలంగాణకు మద్దతివ్వాలని, ఉభయ సభల్లోనూ ఈ అంశాన్ని ప్రస్తావించడం ద్వారా బీసీ రిజర్వేషన్ల పెంపునకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని పార్టీ ఎంపీలను సీఎం కోరనున్నారు.

**పీపీటీ అంశాలపై భట్టి, ఉత్తమ్‌లతో చర్చ**

ఈ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లో పేర్కొనాల్సిన అంశాలపై చర్చించేందుకు ఆదివారం సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలతో రేవంత్‌రెడ్డి విడివిడిగా భేటీ అయ్యారు. ఈ చర్చలు ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట వరకు సాగాయని తెలుస్తోంది. ముఖ్యంగా కులగణన, అసెంబ్లీలో బిల్లు, కులగణనపై నిపుణుల నివేదిక తదితర పరిణామాలకు సంబంధించి పీపీటీలో పేర్కొనాల్సిన కీలకాంశాలపై వీరు చర్చించారని, ఈ నెల 24న ఇవ్వాల్సిన పీపీటీ మంగళవారం పూర్తిస్థాయిలో సిద్ధమవుతుందని సమాచారం.



**ఇందిరా భవన్‌లో పీపీటీ: మల్లు రవి**

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో 100 మంది కాంగ్రెస్ ఎంపీలకు సీఎం రేవంత్‌రెడ్డి బీసీ రిజర్వేషన్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ తెలంగాణ ఎంపీల ఫోరం కన్వీనర్ మల్లు రవి వెల్లడించారు. ఈ నెల 24 సాయంత్రం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఈ కార్యక్రమం ఉంటుదన్నారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎంపీలు రామసహాయం రఘురామిరెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీకృష్ణలతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం వెల్లడించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిచ్చోడిలా మాట్లాడుతున్నారని, సీఎం అనే కనీస మర్యాద లేకుండా రేవంత్ రెడ్డిపై స్థాయికి మించి విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను అధిష్ఠానం పరిశీలిస్తోందని చెప్పారు.

# తెలంగాణ కులగణన చరిత్రాత్మకం

- **ప్రభుత్వం బాధ్యతతో సోషియో ఎకనామిక్, పొలిటికల్, క్యాస్ట్ సర్వే చేసింది**
- **తమ ప్రభుత్వం చేసిన సర్వే దేశంలోనే చారిత్రాత్మకంగా నిలబడుతుంది**
- **పోస్ట్ క్యాస్ట్, ప్రీ క్యాస్ట్ సర్వే రిపోర్ట్ అసెంబ్లీలో పెట్టాం**



**హైదరాబాద్ జూలై 22 (సిద్దిపేట పవర్):**

తెలంగాణలో కులగణన సర్వేపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సెక్రటేరియట్ మీడియా పాయింట్ లో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతతో సోషియో ఎకనామిక్, పొలిటికల్, క్యాస్ట్ సర్వే చేసిందన్నారు. సర్వే మొదలు పెట్టినప్పుడు అనేక సందేహాలు, అవసరం లేదని కొన్ని రాజకీయ పార్టీలు అన్నాయి.. రాష్ట్ర ప్రభుత్వం చేసిన సర్వే చారిత్రాత్మక సర్వేగా దేశంలో నిలబడుతుంది.. పోస్ట్ క్యాస్ట్, ప్రీ క్యాస్ట్ సర్వే రిపోర్ట్ అసెంబ్లీలో పెట్టాం.. రాహుల్ గాంధీ ఆలోచనను భారత ప్రభుత్వం తప్పనిసరిగా ఒప్పుకునే పరిస్థితి వచ్చిందన్నారు.

తెలంగాణ ప్రభుత్వ సర్వే ఆధారంగా త్వరలో దేశంలో కులగణన జరుగబోతోంది.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేను కలిసి తెలంగాణ సర్వే వారికి ఇచ్చి త్వరితగతిన పార్లమెంటులో మద్దతు కూడగట్టి బీసీ రిజర్వేషన్ బిల్ పాస్ చేయించేలా ఒత్తిడి తెస్తాం.. వంద మంది లోక్ సభ సభ్యులు, ఇతర పార్టీల సభ్యులను కలిసి బిల్ పాస్ కావడానికి వారి సహకారం తీసుకుంటాం.. ఓబీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వడం న్యాయమైంది.. సహేతుకమైనదని వారి మద్దతు కూడగడుతాం.. మంచి సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.. ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు కులగణన చేస్తామని హామీ ఇచ్చారు.. దాని ప్రకారమే తెలంగాణలో అధికారంలోకి రాగానే కులగణన చేశాము..

తెలంగాణ మోడల్ ను దేశం ఫాలో అవుతుంది. ఏ రాష్ట్రం అయిన కులగణన చేయాలంటే తెలంగాణను రిఫరెన్స్ గా తీసుకుంటారు.. ముఖ్యమంత్రి నాయకత్వంలో ఓ డెలిగేషన్ ముఖ్య నాయకులను కలసి మద్దతు అడుగుతాం.. 42శాతం బిసి రిజర్వేషన్లకు రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ సభ్యులు మద్దతు ఇచ్చారు.. పార్లమెంటులో కూడా ఆ పార్టీలకు చెందిన మిగతా సభ్యులు కూడా మద్దతు ఇస్తారనే నమ్మకం మాకు ఉంది.. 82 కోట్ల పేపర్లలో సర్వే వివరాలు నిక్షిప్తం అయి ఉన్నాయి. మళ్లీ కులగణనలోని కులాల వివరాలు అసెంబ్లీలో పెడతాం.. 42శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి ఆర్డినెన్స్ ముసాయిదా గవర్నర్ కు పంపాము.. మాకు నమ్మకం ఉంది..

బీజేపీ రామచంద్రరావుకు దళితులు, బలహీన వర్గాలు అంటే చిన్న చూపు ఉంది.. గతంలో కొన్ని సార్లు అలాంటి ప్రయత్నాలకు ఆయన అడ్డు తగిలారు.. రాంచంద్రరావు లీగల్ నోటీసులకు భయపడే వాడు కాదు భట్టి విక్రమార్క.. సమయం వచ్చినప్పుడు లీగల్ నోటీసులకు సమాధానం చెబుతా.. బిసిలను మభ్య పెట్టె ఆలోచన మాకు లేదు.. బీఆర్ఎస్ కు ఆ అలవాటు ఉంది కాబట్టి అలాంటి మాటలు మాట్లాడుతారని విమర్శించారు.

## ఫ్లైట్ మోడ్ సీఎం రేవంత్..
# హాఫ్ సెంచరీ కొట్టారు..

- **రేవంత్ రెడ్డి ఫ్లైట్ మోడ్ సీఎం అని ఎద్దేవా**
- **ఢిల్లీకి వెళ్లడంలో అర్ధ సెంచరీ సాధించారన్న కవిత**
- **బీసీ రిజర్వేషన్లపై జాతీయ పార్టీలు మోసం చేస్తున్నాయని ఆగ్రహం**



**హైదరాబాద్ జూలై 22 (సిద్దిపేట పవర్):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఫ్లైట్ మోడ్ సీఎం అని ఎద్దేవా చేశారు. ఆయన ఈ రోజు కూడా ఢిల్లీకి వెళుతున్నారని, దేశ రాజధానికి వెళ్లడంలో ఆయన ఇప్పటికే అర్ధ సెంచరీ సాధించారని వ్యంగ్యం ప్రదర్శించారు.

ఇన్నిసార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లపై మాత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఒప్పించే ప్రయత్నం చేయలేదని మండిపడ్డారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి గట్టిగా మాట్లాడాలని సూచించారు.

హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ, పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పారని, అయితే బీసీలు పార్టీల పరంగా రిజర్వేషన్లు కోరుకోవడం లేదని తెలిపారు. చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లను వారు కోరుకుంటున్నారని తెలిపారు. రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే బీసీ బిడ్డలు వారిని వదిలి పెట్టరని హెచ్చరించారు.

బీసీ రిజర్వేషన్ల అంశంపై రెండు జాతీయ పార్టీలు మోసం చేస్తున్నాయని కవిత ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడుతున్న మాటలు బాధాకరమని అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో పాస్ చేసి గతంలోనే పంపించినప్పటికీ రాష్ట్రపతి వద్ద పెండింగులో పెట్టి తిరిగి పంపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బిల్లుకు మతపరమైన రంగు పులిమి బీజేపీ బిల్లును పాస్ చేయడం లేదని విమర్శించారు. గుజరాత్‌లో ఎలాంటి రిజర్వేషన్లు ఇచ్చారో అందరికీ తెలుసని, తెలంగాణ విషయంలో మాత్రం బీజేపీ మరో రకంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ 50 శాతానికి పైగా రిజర్వేషన్లను అమలు చేస్తోందని కవిత వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాల విషయానికి వచ్చేసరికి న్యాయస్థానాల పరిధిలో ఉందని సాకులు చెబుతోందని విమర్శించారు. బీసీ బిడ్డలను రిజర్వేషన్లకు దూరంగా ఉంచాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

# పదవీ విరమణపై పది రోజుల క్రితమే ధన్‌ఖడ్ కీలక వ్యాఖ్యలు



- **అనూహ్య రీతిలో ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన ధన్‌ఖడ్**
- **ఆరోగ్య కారణాలను చూపుతూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజీనామా లేఖ**
- **పదవీకాలం ముగియకముందే రాజీనామా చేయడంపట్ల పలువురు అనుమానాలు**
- **ఇటీవల ఆయన పదవీ విరమణ గురించి మాట్లాడిన వీడియో నెట్టింట వైరల్**

**న్యూఢిల్లీ జూలై 22 (సిద్దిపేట పవర్):**

ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్య రీతిలో తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆరోగ్య కారణాలను చూపుతూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపిన తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. అయితే, పదవీకాలం ముగియకముందే ఆయన రాజీనామా చేయడం పట్ల పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో ఆయన ఇటీవల పదవీ విరమణ గురించి మాట్లాడిన వీడియో ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. రాజీనామాకు పది రోజుల క్రితమే పదవీ విరమణపై ధన్‌ఖడ్ మాట్లాడుతూ... 2027 ఆగస్టులో సరైన సమయంలో రిటైర్ అవుతానన్నారు. అయితే, అది దైవ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. జులై 10న జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఉప రాష్ట్రపతి ఈ వ్యాఖ్యలు చేశారు.

అనంతరం పది రోజులకు అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి వైదొలుగుతున్నట్లు పేర్కొంటూ.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాజీనామా లేఖను పంపారు. వైద్యుల సూచన మేరకు ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఎ) కు అనుగుణంగా ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో నకిలీ నోట్ల చలామణి..

- **ఇద్దరు యువకులు అరెస్ట్**
- **మెహిదీపట్నం పోలీసుల దాడిలో నకిలీ కరెన్సీ బహిర్గతం**
- **మహారాష్ట్రకు చెందిన అజీముద్దీన్, అదిల్ హుసేన్ అరెస్ట్**
- **రూ.2 లక్షల నకిలీ నోట్లు స్వాధీనం.. ఆకాశ్ కోసం గాలింపు**

**హైదరాబాద్ జూలై 22 (సిద్దిపేట పవర్):**

హైదరాబాద్‌లో నకిలీ కరెన్సీ చలామణి ప్రయత్నం వెలుగులోకి వచ్చింది. మెహిదీపట్నం పోలీసులు ప్రత్యేక సమాచారం ఆధారంగా ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద రూ.2 లక్షల విలువైన నకిలీ 500 రూపాయల నోట్లు స్వాధీనం అయ్యాయి.

మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కి చెందిన అన్సారీ అఫ్తాబ్ అజీముద్దీన్ తన నానమ్మ ఇంటికి, హైదరాబాద్ ఫస్ట్ లాన్సర్ ప్రాంతానికి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ స్థానికంగా ఉండే అదిల్ హుసేన్‌తో పరిచయం ఏర్పడి, నకిలీ నోట్ల వ్యాపారం కోసం ఇద్దరూ యత్నించారని పోలీసులు వెల్లడించారు.

మహారాష్ట్రలోని తన పరిచయం ఆకాశ్ దొంగ నోట్లు తయారు చేస్తాడని అజీముద్దీన్ అదిల్‌కి చెప్పాడు. 30 వేల రూపాయల అసలైన నోట్లు ఇస్తే లక్ష రూపాయల నకిలీ కరెన్సీ ఇస్తాడని ఆశ చూపాడు. భారీ కమీషన్ వస్తుందని ప్రలోభపెట్టడంతో ఇద్దరూ నకిలీ నోట్లను తెప్పించి నగరంలో చలామణి చేయాలని ప్రణాళిక రచించారు.

ఫస్ట్ లాన్సర్ శ్రీరామనగర్ వద్ద వీరు నకిలీ నోట్లతో ఉన్నారన్న సమాచారం మేరకు మెహిదీపట్నం పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం నకిలీ కరెన్సీ తయారు చేసిన ఆకాశ్ కోసం గాలింపు ప్రారంభించారు.




# బీసీ రిజర్వేషన్లపై బీజేపీ తన గుణం బయటపెట్టింది

- **"బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యం".. పొన్నం ప్రభాకర్ స్పష్టం**
- **బీజేపీ ఎంపీలకు మంత్రి సవాలు.. "రాజీనామా చేసి చూపించండి"**
- **"సామాజిక న్యాయానికి కాంగ్రెస్‌నే మద్దతు".. బీసీ వర్గాలకు పిలుపు**

**హైదరాబాద్ జూలై 22 (సిద్దిపేట పవర్):**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం అసాధ్యం అనడం బీజేపీ అసలు స్వరూపాన్ని బయటపెడుతోంద1r పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. ఇవాళ ఆయన మాట్లాడుతూ.. గతంలో పక్క రాష్ట్రం తమిళనాడులో ఇదే విధమైన రిజర్వేషన్లు అమలు అయ్యాయి. సుప్రీంకోర్టు ఇందిరా సహనీ కేసులో స్పష్టంగా చెప్పింది – రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ప్రమాణితమైన సమాచారం, ఎంపెరికల్ డేటా ఉంటే వారు రిజర్వేషన్ నిర్ణయం తీసుకోవచ్చని" అన్నారు.

"ఈ క్రమంలోనే తెలంగాణ ప్రభుత్వం సర్వే చేసింది, కేబినెట్ ఆమోదం తీసుకుంది, శాసనసభ ఆమోదం పొందింది. గవర్నర్ ఆమోదంతో అది ఇప్పుడు ఢిల్లీలో ఉంది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాల్సిన బాధ్యత ఉంది" అని ఆయన అన్నారు.

"తెలంగాణ బీజేపీ ఎంపీలు రిజర్వేషన్ల కోసం రాజీనామా చేయాలి. నిజంగా బీసీల పక్షాన నిలబడాలని ఉంటే, రిజర్వేషన్లు అమలయ్యేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి చూపాలి. లేకపోతే బీసీల పట్ల కుట్ర చేస్తూ ఉంటారని భావించాలి" అని మంత్రి ఘాటుగా వ్యాఖ్యానించారు. అలాగే, "అనాడు మండల కమిషన్‌ను వ్యతిరేకించింది బీజేపీయే. ఇప్పుడు మళ్లీ బీసీల రిజర్వేషన్లపై వక్రబుద్ధిని చూపిస్తోంది. తెలంగాణలోని అన్ని బీసీ సంఘాలు ఈ కుట్రను గమనించి రిజర్వేషన్ హక్కులను కాపాడేందుకు ముందుకు రావాలి" అని పిలుపునిచ్చారు.



# రైస్ మిల్లులో స్పిరిట్‌తో నకిలీ లిక్కర్ తయారీ గుట్టురట్టు

- **చీప్ లిక్కర్‌తో ప్రముఖ బ్రాండ్ల నకిలీ మద్యం తయారీ**
- **వేల లీటర్ల నకిలీ మద్యం, లేబుల్స్ స్వాధీనం**
- **గ్రామీణ షాపులకు నకిలీ మద్యం సరఫరా.. ఎక్సైజ్ దాడి**


**హైదరాబాద్ జూలై 22 (సిద్దిపేట పవర్):**

హైదరాబాద్ శివారులో ఎక్సైజ్ శాఖ అధికారులు పెద్ద ఎత్తున నకిలీ లిక్కర్ తయారీ ముఠాను పట్టుకున్నారు. చీప్ లిక్కర్‌తో పాటు నాటు సారాను కలిపి ప్రముఖ బ్రాండ్ల పేరుతో నకిలీ మద్యం తయారు చేసి అమ్ముతున్న ముఠాను ఎక్సైజ్ అధికారులు గుర్తించారు.

ప్రముఖ బ్రాండ్ల లేబుల్స్‌ను సేకరించి చీప్ లిక్కర్‌ను ఖరీదైన మద్యం పేరుతో విక్రయిస్తున్న ఈ గ్యాంగ్ పెద్ద ఎత్తున నకిలీ సీసాలు మార్కెట్లోకి పంపుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న షాపులకు ఈ నకిలీ మద్యాన్ని సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

దాడిలో వేల లీటర్ల నకిలీ మద్యం, పెద్ద మొత్తంలో ఖాళీ సీసాలు, క్యాప్స్, ప్రముఖ బ్రాండ్ల నకిలీ లేబుల్స్ స్వాధీనం అయ్యాయి. నకిలీ లిక్కర్ తయారీ కోసం ముఠా చిన్నపాటి పరిశ్రమ స్థాపించి పద్ధతిగా పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ ముఠా కార్యకలాపాలు బయటపడడంతో ఎక్సైజ్ అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. నగరం పరిసరాల్లో ఇలాంటి నకిలీ లిక్కర్ తయారీ యూనిట్లు ఉన్నాయా అనే దానిపై విస్తృతంగా దర్యాప్తు చేపట్టనున్నారు.



# ఈడీ దాడుల వెనుకట్యాపింగ్ రాడార్!

- కీలక మంత్రిపై ఈడీ రైడ్ వెనుక ఫోన్ ట్యాపింగ్
- భవిష్యత్తు భయంతోనే ముఖ్యనేత నిఘా
- లగ్జరీ రిస్ట్ వాచ్‌లు, మనీలాండరింగ్ ఉదంతాల్లో
- సంభాషణలు గుట్టుగా విన్నట్టు అనుమానాలు
- గత సెప్టెంబర్‌లో కీలక నేత, ఆయన బంధువుల
- ఇండ్లలో జరిగిన ఈడీ సోదాలు తాజాగా తెరపైకి!
- యువ ఎమ్మెల్యే చేతికి కీలక భూమి పత్రాలు
- దానికీ ట్యాపింగే కారణమంటున్న నేత సన్నిహితులు

**హైదరాబాద్ జూలై 22(సిద్దిపేట పవర్):**

మకావ్ నుంచి లగ్జరీ వాచ్‌ల దిగుమతిని ముఖ్యనేత రాడార్ పసిగట్టిందా? రూ.5 కోట్ల ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు ఫోన్ ట్యాపింగ్‌లో రికార్డు అయ్యిందా? 'లగ్జరీ రిస్ట్‌వాచ్ ఫిబ్రవరి 5న చెన్నైకి వస్తుంది' అని ఫోన్ ట్యాపింగ్ విశ్లేషణలోనే బయటపడిందా? పక్కా నిర్ధారణతోనే చెన్నై కస్టమ్స్ అధికారులకు తెలంగాణ నుంచి ఫోన్ వెళ్లిందా? అంటే 'అవును' అనే సమాధానమే వస్తున్నది. మంత్రుల ఫోన్ ట్యాపింగ్ కలకలం నేపథ్యంలో నిరుడు సెప్టెంబర్‌లో రాష్ట్రంలోని ఓ కీలక మంత్రి, ఆయన బంధువుల ఇండ్లపై జరిగిన ఈడీ రైడ్స్ తెరమీదకొచ్చాయి.

కీలక మంత్రి అకౌంటెంట్ ఫోన్ ట్యాపింగ్‌తోనే లగ్జరీ రిస్ట్‌వాచ్‌ల స్మగ్లింగ్ గుట్టు బయటికి వచ్చిందని కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం ఊపందుకున్నది. ముఖ్యనేతతో విభేదాలేవీ లేకున్నా అనతి కాలంలోనే ఆర్థిక శక్తిగా ఎదిగిన ఆయన భవిష్యత్తులో తనకు ముప్పుగా మారే ప్రమాదం ఉన్నదని గుర్తించిన ముఖ్యనేత వర్గం సదరు మంత్రి, ఆయనకు సంబంధించిన కీలక సిబ్బందిపై నిఘా పెట్టినట్టు సమాచారం. రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సైతం ఊహించనంత ఆర్థిక తోడ్పాటును అందించారనే ప్రచారం ఉన్న సదరు నేత.. పార్టీ అధికారంలోకి రాగానే నంబర్ టూ స్థాయికి ఎదిగారని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

అదే సమయంలో మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయని, ఈ నేపథ్యంలో హర్యానా ఎన్నికల నోటిఫికేషన్ రావటానికి ఆరునెలల ముందుగానే సదరు నేతను అధిష్ఠానం ఢిల్లీకి పిలిచినట్టు సమాచారం. హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఖర్చులో కొంత భాగాన్ని సమకూర్చే బాధ్యత ఢిల్లీ అధిష్ఠానం తెలంగాణకు చెందిన కీలక నేతలకు అప్పగించినట్టు తెలిసింది.

ఇదే ముఖ్యనేతకు కంటగింపుగా మారినట్టు పార్టీ శ్రేణులు చెప్తున్నాయి. ఓవైపు తాను అధికారిక కార్యక్రమాల మీద ఢిల్లీకి వెళ్లినప్పుడు ఉప ముఖ్యమంత్రిని తోడు తీసుకెళ్లాలని ఆంక్షలు పెట్టడం, ఇంకో వైపు ఢిల్లీ ఆర్థిక అవసరాల కోసం నంబర్ టూ మీద ఆధారపడటంతో అనుమానం వచ్చిన ముఖ్యనేత.. మంత్రుల మీద నిఘా పెట్టడం మొదలు పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. ఫోన్ ట్యాపింగ్, జీపీఎస్ డిటెక్టింగ్ ద్వారా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతల కదలికలపై నిఘా పెట్టినట్టు చర్చ నడుస్తున్నది.

**తెలంగాణ నుంచి చెన్నైకి ఫోన్**

ఇదే సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లో సదరు కీలక మంత్రికి చెందిన కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఉదంతం ఒకటి వెలుగులోకి వచ్చింది. కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కాంట్రాక్టు పనులు తీసుకున్నది. ఈ పనులకు సంబంధించి కరేబియన్‌కు చెందిన ఎగ్జిమ్ బ్యాంకు ష్యూరిటీ ఇచ్చింది. గత ప్రభుత్వం ఈ ష్యూరిటీలను అంగీకరించింది. అనంతరం వచ్చిన చంద్రబాబునాయుడు ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. కాంగ్రెస్ పార్టీ అనుకూల మీడియా ఈ అంశాన్ని హైలైట్ చేసింది.

అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు ప్రభుత్వం సదరు కన్‌స్ట్రక్షన్ కంపెనీ ష్యూరిటీ మీదనే ఎలా దృష్టి పెట్టిందనేది మిలియన్ డాలర్ల ప్రశ్న! అది మొదలు వరుసగా లగ్జరీ రిస్ట్ వాచ్‌లు, హిమాయత్‌సాగర్‌లో ఆయన ఇంటి మీద ఆరోపణలు, ఈడీ దాడుల వ్యవహారాల పరంపర కొనసాగింది. సొంత పార్టీలోని 'ముఖ్య' నేతే పక్కా పథకంతో ఇరికించారని అప్పట్లో సదరు కీలక మంత్రి సన్నిహితులు బహిరంగంగానే ఆందోళన వ్యక్తంచేశారు. తాజాగా మంత్రుల ఫోన్ ట్యాపింగ్ జరుగుతున్నట్టు బయటపడటంతో నాటి ఈడీ దాడుల వెనుక ఫోన్ ట్యాపింగ్ ఉన్నదని మంత్రి సన్నిహితులు అంటున్నారు. పక్కాగా ఫోన్ సంభాషణ విన్నారు కాబట్టే ముబిన్ అనే వ్యక్తి ఫిబ్రవరి 5న చెన్నైకి వస్తున్నారని తెలిసి, అక్కడి కస్టమ్స్ అధికారులకు ఉప్పందించినట్టు, తెలంగాణ నుంచే కస్టమ్స్‌కు ఫోన్ వెళ్లినట్టు తమకు తర్వాత తెలిసిందని కీలక మంత్రి సన్నిహితులు చెప్తున్నారు.

**యువ ఎమ్మెల్యే చేతికి కీలక పత్రాలు..**

మరోవైపు సదరు కీలక మంత్రి చేసిన ప్రతి లాండ్ డీలింగ్ వివరాలు కూడా ముఖ్యనేత గుప్పిట్లో ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఖరీదైన ప్రాంతంలో ప్లాట్ దగ్గర నుంచి మొదలు పెట్టి నగరం శివారులో ఆయన సెటిల్‌మెంట్ చేసి తీసుకున్న ఇంచు భూమి వివరాలు కూడా ముఖ్యనేత వద్ద ఉన్నాయనే ప్రచారం జరుగుతున్నది. ఆయా వివాదాస్పద భూ ములకు సంబంధించిన డాక్యుమెంట్లు, సెటిల్‌మెంట్ల పురోగతి నివేదికలు తీసుకొని యువ ఎమ్మెల్యేకు ఇచ్చినట్టు ప్రచా రం జరుగుతున్నది.

ఈ ముఖ్యనేత ఇచ్చిన తోడ్పాటుతోనే గతంలో ఎంసీహెచ్‌ఆర్డీలో జరిగిన సీఎల్‌పీ సమావేశంలో యువత ఎమ్మెల్యే రెండు ఫైళ్లలో డాక్యుమెంట్లు తీసుకొని సదరు కీలక మంత్రిపై పరోక్షంగా అవినీతి ఆరోపణలు చేసింది బహిరంగ రహస్యమే. యువనేతకు ఇంటెలిజెన్స్ ద్వారా సమాచారం అందిందని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఫోన్ ట్యాపింగ్ ద్వారానే సదరు కీలక మంత్రి భూ సెటిల్‌మెంట్ వ్యవహారం బయటికి వచ్చిందని ఆయన అనుచరులు ఇప్పుడు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న ఫోన్‌ట్యాపింగ్ ఆరోపణలపై విచారణ చేపట్టాని సదరు మంత్రి సన్నిహితులు డిమాండ్ చేస్తున్నారు.

**నిఘాకు ఉసిగొల్పిన భయం**

అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్థిక తోడ్పాటు అందించటం ద్వారా సదరు మంత్రి సొంత ఎమ్మెల్యేల బలం పెంచుకున్నారని కాంగ్రెస్ శ్రేణులు బహిరంగంగానే చెప్తున్నాయి. ఇప్పటికిప్పుడు ఆయన బల ప్రదర్శన చేస్తే 25మంది ఎమ్మెల్యేలు ఆయన వెనుకే ఉంటారని కాంగ్రెస్ వర్గాలే అంచనా వేస్తున్నాయి. మరోవైపు ఇప్పుడున్న ముఖ్యనేతను అధిష్ఠానం పూర్తిస్థాయిలో నమ్మడం లేదు.

ఢిల్లీ అవసరాలకు అనుగుణంగా నడుచుకోలేక ఎప్పుడు కాడి పడేస్తారోనన్న అనుమానంతోనే ఉన్నట్టు తెలుస్తున్నది. మరో వైపు ఆయన బడే భాయ్‌కి దగ్గరగా ఉండడం, ఇక్కడి బీజేపీ నేతలు ప్రభుత్వంతో అంటకాగుతుండటం కూడా అధిష్ఠానానికి మింగుడుపడనివ్వడం లేదని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఏదైనా జరగరానిది జరిగితే..ఆర్థిక, సామాజిక పరంగా సదరు మంత్రి ముందు వరుసలో ఉంటాడని ముఖ్యనేత వర్గం ఆందోళన చెందినట్టు సమాచారం.



# అర్హులైన వారి ఇండ్లను రద్దు చేయడం తగదు



**నంగునూరు, జులై 22 (సిద్దిపేట పవర్ ):** అర్హులైన వారికి మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ళను బీజేపీ కార్యకర్తలనే కారణంతో కాంగ్రెస్ నాయకులు రద్దు చేయించారని బీజేపీ నాయకులు విమర్శించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు చౌడుచర్ల వెంకటరాంరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యకుడు పరకాల తిరుపతి రెడ్డి, బీజేపీ నాయకులు వల్లపురెడ్డి రజనీకర్ రెడ్డి, జీడిపల్లి రజనీకర్ రెడ్డి, తుపాకుల నరేశ్, రాంరెడ్డి, కోల సతీశ్ మంగళవారం నంగునూరులో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలు కమీషన్లు ఇవ్వరనే కారణంతో మంజూరు ఆయన ఇందిరమ్మ ఇండ్లను కాంగ్రెస్ నాయకులు రద్దు చేయించారని విమర్శించారు. నంగునూరు మండలంలోని వివిధ గ్రామాల్లో బిజెపి కార్యకర్తలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను రద్దు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన నిరుపేదలు అందరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదన్నారు. వెంటనే అర్హులైన బీజేపీ కార్యకర్తలకు మంజూరైన ఇండ్లను రద్దు చేయడాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణ బేఖాతర్ ఏపీకి జీ హుజూర్!

- రెండు రాష్ట్రాలపై రెండు నాల్కలు
- 11 ఏండ్లుగా కేంద్రంలోని బీజేపీ సర్కారు తీరిదే
- ఆది నుంచీ తెలంగాణ జలహక్కులపై ఉక్కుపాదం
- పదేండ్లుగా డిమాండ్లు, ప్రతిపాదనలు బుట్టదాఖలు
- ప్రాజెక్టులకు అనుమతులివ్వదు.. నిధులూ ఇవ్వదు
- జలవివాదాలపై ఫిర్యాదులెన్ని చేసినా పట్టించుకోదు
- 172 లేఖలు రాసినా స్పందించని కేంద్ర ప్రభుత్వం
- ఆంధ్రప్రదేశ్ విషయంలో అడిగిందే తడవుగా చర్యలు
- వేగంగా అనుమతులు.. ఆగమేఘాలపై ఆదేశాలు
- సీఎంల భేటీతో కేంద్రం ద్వంద్వవైఖరి బట్టబయలు
- బాబు కోసమే 'బనకచర్ల'ను నెత్తినెత్తుకున్న కేంద్రం
- నెల రోజుల్లోనే ప్రాజెక్టు క్లియరెన్స్‌కు రంగం సిద్ధం!

**హైదరాబాద్ జూలై 22 (సిద్దిపేట పవర్):**

తెలంగాణ అంటే గిట్టనట్టుగా, ఇక్కడి వినతులు, విజ్ఞాపనలు పట్టనట్టుగా వ్యవహరిస్తూ వస్తున్న కేంద్రంలోని బీజేపీ సర్కారు.. ఆంధ్రప్రదేశ్ విషయంలో మాత్రం అన్నింటికీ తలూపుతూ వస్తున్నది. అడిగిందే తడవుగా ఆగమేఘాలపై స్పందిస్తున్నది. నీటిపారుదల ప్రాజెక్టులకు అనుమతులిస్తున్నది. అందుకోసం కేంద్ర సంస్థలనూ ఒత్తిడి చేస్తున్నది. తెలంగాణ ఆవిర్భావం నుంచీ మన నీటి హక్కులపై ఉక్కుపాదం మోపుతూ వచ్చిన మోదీ సర్కారు.. రాష్ట్రం చేసిన ప్రతిపాదనలను ఏనాడూ పట్టించుకోలేదు.

అభ్యంతరాలనూ లెక్కచేయలేదు. నీటివాటాలను తేల్చడంలో, ప్రాజెక్టు అనుమతుల మంజూరులో, నిధుల కేటాయింపులో.. అన్నింటా తెలంగాణను విస్మరిస్తున్నది. రాష్ట్ర హక్కుల్ని బేఖాతరు చేస్తూనే.. ఏపీ ముందు మాత్రం కేంద్రంలోని బీజేపీ సర్కారు సాగిలపడుతున్నది. బనకచర్ల విషయంలో ఇదే విషయం మరోసారి స్పష్టమైంది. గత నవంబర్‌లో బనకచర్ల ప్రతిపాదనను బాబు ప్రభుత్వం తెరపైకి తెచ్చినప్పటినుంచీ కేంద్రం అత్యంత వేగంగా స్పందిస్తూ వచ్చింది. తొలి వినతిలోనే ప్రాజెక్టు వ్యయంలో 50 శాతం రుణ సమీకరణకు అనుమతిస్తామని ప్రకటించిన కేంద్రం.. 20 శాతం నిధులు ఇచ్చేందుకూ సమ్మతించింది. ప్రాజెక్టు ప్రతిపాదనలను పరిశీలించాల్సిందిగా కేంద్ర సంస్థలను ఆదేశించింది. ఏపీ ఇచ్చిన ప్రీ ఫీజిబులిటీ రిపోర్ట్‌పైనా వేగంగా చర్యలు చేపట్టింది. ఆగమేఘాలపై తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులను ఒప్పించే బాధ్యతను తానే భుజాన వేసుకుని.. ఢిల్లీలో ప్రత్యేక సమావేశం సైతం నిర్వహించింది.

**11 ఏండ్లుగా తెలంగాణ ప్రధాన డిమాండ్లు..**

బచావత్ ట్రిబ్యునల్ 1 అవార్డు క్లాజ్ 7 ప్రకారం తాగునీటి వినియోగించుకునే జలాల్లో కేవలం 20 శాతం మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. సాగర్‌లో తాగునీటికి కేటాయించిన జలాల్లో 20శాతాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని తెలంగాణ 10 లేఖలు రాసింది.

కృష్ణా జలాల వినియోగానికి సంబంధించి 66:34 నిష్పత్తితో చేసుకున్న తాత్కాలిక ఒప్పందానికి ఎట్టిపరిస్థితులో అంగీకరించబోమని 16వ బోర్డు మీటింగ్‌లో దీనిని తెలంగాణ వ్యతిరేకించింది. ట్రిబ్యునల్ 2 తుది అవార్డును ప్రకటించేవరకు 50:50 నిష్పత్తిలోనే వినియోగించుకుంటామని పట్టుబడుతున్నది. ఇదే విషయమైన 22సార్లు లేఖలు రాసింది.

తెలంగాణ భౌగోళిక ప్రాంతంలో భారీ మొత్తంలో నీటిని నిల్వను చేసుకునేందుకు ఆఫ్‌లైన్ రిజర్వాయర్లు లేవు. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నిల్వ చేసుకుని, భవిష్యత్తు తాగు, సాగునీటి అవసరాల మేరకు తదుపరి సంవత్సరం వినియోగించుకునే అవకాశమివ్వాలని తెలంగాణ విజ్ఞప్తి చేస్తూ వస్తున్నది. అందుకు ఏపీ మోకాలడ్డటం, బోర్డు వంతపాడటం పరిపాటిగా మారింది. ఏపీ బేసిన్ అవతల నిల్వ చేసుకున్న కృష్ణా జలాలను మాత్రం అకౌంట్ చేయడం లేదు. ఈ మేరకు 15సార్లు తెలంగాణ లేఖలు రాసినా స్పందన లేదు.

అంతర్రాష్ట్ర జలవివాదాల చట్టం1956 సెక్షన్3ని అనుసరించి వెంటనే ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసి కృష్ణా జలాలను తెలంగాణ, ఏపీ మధ్య పునఃపంపిణీ చేయాలని 2016 ఫిబ్రవరి 11న ప్రధాని మోదీకి సీఎం కేసీఆర్ స్వయంగా లేఖను అందజేశారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశాల్లోనూ విన్నవించారు. కానీ కేంద్రం 2023 ఆగస్టులో ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేస్తూ అదనపు టీవోఆర్‌ను మంజూరు చేసింది.

పోలవరం ముంపుపై సమగ్ర అధ్యయనం చేయించాలి. తెలంగాణలో ముంపునకు గురవుతున్న ప్రాంతాల్లో పూర్తిగా సంబంధిత ప్రాజెక్టు అథారిటీతోనే కరకట్టలు, రక్షణ చర్యలు చేపట్టేలా చూడాలని డిమాండ్ చేస్తున్నా ఇప్పటికీ కేంద్రం నుంచి స్పందన లేదు.

రివర్‌బోర్డుల గెజిట్ నుంచి అనుమతుల్లేని ప్రాజెక్టుల జాబితా నుంచి 'కల్వకుర్తి' రెండో భాగాన్ని తొలగించాలని, ఎస్ఎల్ఎల్‌బీ, ఎమ్మార్పీ ప్రాజెక్టును ఒకే కాంపోనెంట్‌గా పరిగణించాలని కోరినా మోదీ ప్రభుత్వం చెవికెక్కించుకోలేదు.

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఈఏసీ సిఫారసుల మేరకు అనుమతులు మంజూరు చేయడం లేదు. నిధుల సాయం చేయాలని చేసిన విజ్ఞప్తినీ బుట్టదాఖలు చేసింది.

కందకుర్తి లిఫ్ట్, గూడెం లిఫ్ట్, రామప్పపాకాల లింక్, కంతనపల్లి ప్రాజెక్టులకు అనుమతులే అక్కర్లేదు. వాటిని కూడా గెజిట్ నుంచి తొలగించాలని కోరుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదు.

కేటాయించిన జలాలను తక్కువ సమయంలో ఎత్తిపోసుకునేందుకు కాళేశ్వరం ప్రాజెక్టులో 3వ టీఎంసీ తరలింపు పనులు తెలంగాణ చేపట్టింది.



అదనపు టీఎంసీగా చూపవద్దని కోరినా కేంద్రం వినలేదు. డీపీఆర్ సమర్పించాలని మెలిక పెట్టింది. తీరా డీపీఆర్‌ను సమర్పిస్తే దానిని తిరస్కరించింది. ఇదేకాదు ఛత్తీస్‌గఢ్ ఎన్‌వోసీ ఇవ్వకపోవడాన్ని సాకుగా చూపించి సమ్మక్కసాగర్ డీపీఆర్‌ను, అదేవిధంగా వార్ధా ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్రం తిప్పిపంపింది.

ఏపీ ప్రభుత్వం అక్రమించుకున్న సాగర్ కుడి కాలువ హెడ్‌రెగ్యులేటరీ, గేట్లను తిరిగి స్వాధీనం చేయాలని తెలంగాణ కోరుతున్నా.. దీనిపై మాత్రం కేంద్రం ఉలకదు.. పలకదు.

ఏపీ చేపడుతున్న రాయసీమ లిఫ్ట్, హెచ్ఎన్ఎస్ఎస్, జీఎన్ఎస్ఎస్, పోతిరెడ్డిపాడు, తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ, కేసీ కెనాల్ విస్తరణ పనులను అడ్డుకోవాలని, ఆయా ఔట్‌లెట్లపై టెలిమెట్రీలను ఏర్పాటు చేయాలని, ఎంత నీటిని విడుదల చేస్తున్నారో పర్యవేక్షించాలని తెలంగాణ లేఖలు రాస్తున్నా కేంద్రం పట్టించుకోవడంలేదు.

**బనకచర్లపై ఏపీ ఒత్తిడి.. కేంద్రం హడావుడి..**

పదేండ్లుగా తెలంగాణ వినతులను, ఫిర్యాదులను పెడచెవిన పెట్టిన కేంద్రం.. ఏపీ విషయంలో మాత్రం మొదటినుంచీ ఎక్కడలేని అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నది. తాజాగా బనకచర్ల ఉదంతంలోనూ ఇదే స్పష్టమైంది. అనుమతులు తీసుకోకుండానే గోదావరి జలాల నుంచి 200 టీఎంసీలను తరలించేందుకు పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. దాదాపు రూ.80 వేల కోట్లతో రూపొందించిన ఏపీ ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం సైతం వత్తాసు పలుకుతున్నది. బనకచర్ల ప్రాజెక్టుకు ఆర్థికసాయం అందించాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిరుడు నవంబర్ 11న కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు.

డిసెంబర్‌లో ప్రధాని మోదీ, కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌లను నేరుగా కలిసి విన్నవించారు. వెనువెంటనే ప్రాజెక్టు వ్యయంలో 50 శాతం మేరకు రుణ సమీకరణకు ఎఫ్ఆర్‌బీ అనుమతినిస్తామని, 20శాతం నిధులను నుంచి గ్రాంట్‌గా ఇస్తామని కేంద్రం ప్రకటించేసింది. అంతేకాదు ఏపీ ప్రతిపాదనలను పరిశీలించాలని వెనువెంటనే అన్ని కేంద్ర సంస్థలకు ఆదేశాలను జారీ చేసింది. 2025 మే 24న మరోసారి కేంద్ర ఆర్థికశాఖ మంత్రిని ఏపీ సీఎం చంద్రబాబు స్వయంగా కలిసి ప్రాజెక్టుకు నిధులివ్వాలని కోరారు. కేంద్రం సానుకూలత వ్యక్తంచేయడంతోపాటు ప్రతిపాదనలను స్వయంగా సూచించారు.

దీంతో జూన్ 2న కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి అజయ్ సేథ్‌కు ప్రాజెక్టుపై ఏపీ అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా పీఎఫ్ఆర్ (ప్రీ ఫీజబిలిటీ రిపోర్టు)ను సైతం ఏపీ సమర్పించింది. కేంద్రం ఆగమేఘాలపై పీఎఫ్ఆర్‌ను కేంద్ర జల్‌శక్తి శాఖకు పంపగా, ఆ శాఖ సైతం అంతే వేగంగా జూన్ 10న సీడబ్ల్యూసీ, గోదావరి, కృష్ణా రివర్‌బోర్డులతోపాటు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలకు పంపింది. అభిప్రాయాలను తెలపాలని సూచించడం కాదు.. ఈ నెల జూలై 24 తేదీలోగా అభిప్రాయాలను వెల్లడించకుంటే ఆ తరువాత పంపినా పరిగణనలోకి తీసుకోబోమని అల్టిమేటం సైతం జారీ చేయడం గమనార్హం. ఇప్పుడు బనకచర్ల ప్రాజెక్టు కోసం కేంద్ర జల్‌శక్తి శాఖనే మధ్యవర్తిగా మారి ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను పిలిచి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. వారంలో కమిటీ వేసి, నెల రోజుల్లో నివేదిక తెప్పించుకుని అనుమతులు ఇచ్చేందుకు రంగం చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో ఏపీ తాన అంటే.. కేంద్రం తందాన అంటూ ముందుకు సాగుతున్న తీరు అందరికీ అర్థమవుతున్నది.

**ఏపీ అడిగిందే తడువుగా వరాలు**

తెలంగాణపై అడుగడుగునా వివక్ష చూపుతున్న కేంద్రం.. ఏపీకి మాత్రం వరాలు కురిపిస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో చంద్రబాబు కోరిన వెంటనే కేంద్రం స్పందించి.. పోలవరం ముంపు మండలాలు ఏడింటిని ఏపీలో విలీనం చేసింది. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదాను ఇచ్చింది. నిధులను సమకూర్చుతున్నది. వాస్తవంగా శ్రీశైలం ప్రాజెక్టును హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుగానే ట్రిబ్యునల్ గుర్తించింది. జలవిద్యుత్తు ఉత్పత్తి చేస్తూ నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేసి, ఆ ప్రాజెక్టు కింద ఆయకట్టుకు అందివ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం స్థాపిత సామర్థ్యం మేరకు జలవిదుత్తు ఉత్పత్తి చేపట్టాలని జారీ చేసిన జీవో34ను ఏపీ వ్యతిరేకించింది. ఏపీ ఫిర్యాదు చేయగానే బోర్డు ఇప్పటిదాకా ఆంక్షలను అమలు చేస్తున్నది. తెలంగాణ అనేక ప్రాజెక్టుల డీపీఆర్‌లను సమర్పించింది. ఏపీ గోదావరి, కృష్ణా బేసిన్‌లకు సంబంధించి ఒక్క ప్రాజెక్టు డీపీఆర్‌ను కూడా సమర్పించలేదు. అయినా కేంద్రం అదేమని అడిగిందీ లేదు!.. ఏపీని ఆపిందీ లేదు!3

# డెంగీ డేంజర్ బెల్స్..

- రాష్ట్రవ్యాప్తంగా విజృంభిస్తున్న జ్వరాలు
- జూన్‌లో 500మందికి పైగా బాధితులు
- తీవ్ర ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు
- నియంత్రణలో కాంగ్రెస్ సర్కారు విఫలం
- జూన్‌లో 500మందికి పైగా బాధితులు
- తీవ్ర ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు
- నియంత్రణలో కాంగ్రెస్ సర్కారు విఫలం



**హైదరాబాద్ జూలై 22 (సిద్దిపేట పవర్):**

రాష్ట్రంలో డెంగీ ప్రమాదఘంటికలు మోగిస్తున్నది. భారీగా నమోదవుతున్న కేసులతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ నాటికి 1,200 కేసులు నమోదయ్యాయి. ఒక్క జూన్‌లోనే 500 పైగా కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. హైదరాబాద్‌తో పాటు ఆదిలాబాద్, సంగారెడ్డి, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, భువనగిరి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అధికంగా కేసులు నమోదవుతున్నాయి. ఇందులోనూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 25 శాతం మంది బాధితులు ఉన్నారని అధికారిక లెక్కలే స్పష్టంచేస్తున్నాయి.

ఐదేండ్లలో 2024లోనే అత్యధికంగా 1,00,77 డెంగీ కేసులు నమోదయ్యాయి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులను, జ్వరాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను అమలు చేయాల్సి ఉంటుంది. కానీ 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టకపోవడం వల్లే 2024లో కేసులు పెరిగాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వంలో ఆరోగ్యశాఖపై ప్రత్యేక శ్రద్ధతో విషజ్వరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నామని, కానీ కాంగ్రెస్ హయాంలో పాలన పడకేసిందని బీఆర్ఎస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు.

**వర్షా కాలం జాగ్రత్తలు పాటించాలి**


ప్రజలు డెంగీ బారిన పడకుండా ఇండ్లలో తప్పనిసరిగా దోమతెరలు వాడాలి. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. గుడ్‌నైట్, ఆలౌట్ వంటివి పడుకునే రెండు గంటల ముందు ఆన్ చేసుకుని.. ఆఫ్ చేసిన రెండు గంటల తర్వాతే ఆ గదిలో పడుకోవాలి. పిల్లలను బయటకు తీసుకెళ్లేటప్పుడు నిండుగా దుస్తులు తొడిగించాలి. అధిక జ్వరం, తలనొప్పి, వెన్నునొప్పి, కీళ్ల నొప్పులు, శరీరంపై ఎర్ర మచ్చలు, నీరసం, చీకాకుగా ఉండటం, విపరీతంగా పొట్ట నొప్పి, వాంతులు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

# జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు

**సిద్దిపేట అర్బన్(సిద్దిపేట పవర్):**




కమిషనరేట్ పరిధిలో మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు సర్ప్రైజ్ వాహనాల తనిఖీలు నిర్వహించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి అక్రమ రవాణా నివారణ గురించి, వాహనాల తనిఖీ నిర్వహించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 68 నమోదు చేయడం జరిగింది. వితౌట్ నెంబర్ ప్లేట్స్, త్రిబుల్ రైడింగ్, అధిక వేగంతో వాహనాలు నడిపే వారిపై, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారిపై, సరియైన ధ్రువపత్రాలు లేని వారిపై, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించని వారిపై ఎం వి యాక్ట్ ప్రకారం 410 కేసులు నమోదు చేయడం జరిగిందని పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో రాజీవ్ రహదారిపై ఇతర రహదారులపై నిన్న సాయంత్రం నుండి రాత్రి వరకు ప్రత్యేకంగా వాహనాల తనిఖీ నిర్వహించడం జరిగింది. వాహనాల తనిఖీలలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు అక్రమ రవాణా నివారించడం గురించి తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. తరచుగా సర్ప్రైజ్ వాహనాల తనిఖీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.





## ఆషాడ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన ఇరిగేషన్ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి దంపతులు

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ జూలై 21 ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి గ్రామంలో శ్రీ రేణుకా మాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ఇరిగేషన్ విష్ణువర్ధన్ రెడ్డి దంపతులు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా అమ్మవారిని దర్శించుకోవడం జరుగుతుందని, కోరిన కోరికలను ఇచ్చే తల్లిగా, మహిమలున్న అమ్మవారుగా దర్శనమిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా మా కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, అమ్మవారి ఫోటో ఇచ్చి సన్మానం చేయడం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విధంగా ఆలయ కమిటీ సభ్యులు ముందుకు వెళ్లడం పట్ల భక్తులు ఎక్కువ వచ్చే అవకాశం ఉందని ఆలయ కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ రేణుక మాత ఆలయ కమిటీ చైర్మన్ ఏల్పుల మహేష్, తాజా మాజీ సర్పంచ్ సద్దిరాజు రెడ్డి, ఆశంగారి కిషన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## దుబ్బాకలో 26న మెగా హెల్త్ క్యాంప్ పోస్టర్ ఆవిష్కరణ

**ఉచిత హెల్త్ క్యాంప్ ను పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ జూలై 21 ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలోని ఆర్య వైశ్య భవన్లో అఖిల రాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తౌడా సత్యనారాయణ,ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు ప్రముఖ వ్యాపార వేత్త చింత రాజు ఆధ్వర్యంలో మంగళవారం మెగా హెల్త్ క్యాంప్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా అఖిలరాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తౌడ సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 26 శనివారం రోజున ఉచిత మెగా హెల్త్ క్యాంపును నిర్వహిస్తున్నామని దుబ్బాక, నియోజకవర్గం,చుట్టూ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ యొక్క హెల్త్ క్యాంప్ లో దాదాపు పది రకాలైన వ్యాధులకు వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మెడిసిన్ అందిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో దుబ్బాక పుర ప్రముఖులు మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు వడ్లకొండ శ్రీధర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చింత నాగేందర్,సుభాష్,అఖిల రాజ్ ఫౌండేషన్ సభ్యులు ఇనుప రవి, బాలశేఖర్, అస్కె స్వామి, కిసరా స్వామి,వెంకట్,ర్యాకం అనిల్,తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బాక మున్సిపాలిటీ 2వ వార్డు పరిధిలో చెల్లాపూర్

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ జూలై 21 ప్రతినిధి**

బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త దుబ్బాక శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తుంటి ఎముక ఫ్రాక్చర్ అవ్వడం జరిగింది. ఈ సమాచారం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తిక గౌడ్ వారిని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. అలాగే వారు త్వరగా కోలుకోవాలని వారికి మనో ధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ 3వ వార్డ్ కౌన్సిలర్ గోనేపల్లి దేవలక్ష్మి సంజీవ్ రెడ్డి, వేణుగోపాల స్వామి టెంపుల్ చైర్మన్ కంకణాల దేవయ్య, సీనియర్ నాయకులు కొత్త దేవి రెడ్డి, దుబ్బరాజా గౌడ్ పరుశురాములు, 2వ వార్డ్ యూత్ ప్రెసిడెంట్ షాదుల్లా, మహేందర్ రెడ్డి, కనకాల చంద్రశేఖర్,రుద్రారం నవీన్, కామోజీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.



## తాళం పెట్టిన ఇంట్లో దొంగతనం

**నంగునూరు జూలై22 (సిద్దిపేట పవర్)**

నంగునూరు మండలం దర్గపల్లి గ్రామానికి చెందిన చాడ శ్రీనివాస్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి ఆదివారం రోజు తన యొక్క భార్య తో కలిసి హైదరాబాద్ లో ఉంటున్న తన కూతురు దగ్గరకి బోనాల పండగకు ఇంటికి తాళం వేసి వెల్లినరు. సోమవారం రాత్రి ఎవరో గుర్తు తెలియని దొంగలు తన ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడి బీరువాలో ఉన్న ఎనిమిది తులాల బంగారం మరియు 12 తులాల వెండి పట్టగొలుసులు ఎత్తుకొని వెళ్ళినారు అని చాడా శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు రాజగోపాల్పేట ఎస్సై వివేక్ గారు తెలిపినారు.



# పీడిత ప్రజల గొంతుక దాశరధి

**అయినాపూర్ లో ఘనంగా మహాకవి దాశరధి కృష్ణమాచార్య శతజయంతి వేడుకలు.**

**సిద్దిపేట పవర్:**

కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామంలో మహాకవి దాశరధి కృష్ణమాచార్య శత జయంతి వేడుకలు జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు జంగా శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన వహించగా ముఖ్యఅతిథిగా తెలంగాణ సాంస్కృతిక సారధి కవి గాయకులు పిన్నింటి రత్నం పాల్గొని దాశరధి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడుతూ నా తెలంగాణ తల్లి కంజాత వల్లి నా తెలంగాణ కోటి రత్నాల వీణ అని సగర్వంగా ప్రకటించి తెలంగాణ ప్రజలల్లో చైతన్యం నింపిన మహాకవి దాశరధి అని కొనియాడుతూ నిజాం నిరంకుశత్వంపై కలంతో కవాతు చేసి జైలు గోడలను అనుభవించి స్వాతంత్ర సమరయోధునిగా ప్రజా వాగ్గేయకారునిగా మహాకవిగా సినీ గేయ రచయితగా అగ్నికనంగా రచనలు చేస్తూ అగ్నిధార రుద్రవీణ నేత్రపర్వం కావ్యాలు రాసి తన సాహిత్యం ద్వారా పీడిత ప్రజల భావాలకు తెలంగాణ ప్రజల గొంతుకై నిలిచిన దిక్కార స్వరం మహాకవి దాశరధి అని నేటి కవులకు కళాకారులకు ఒక దిక్సూచి అని కొనియాడారు, ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి మాజీ చైర్మన్ దండు నర్సింహులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం ముస్త్యాల యాదగిరి, పబ్బోజు రాజమౌళి,ఎండి సయ్యద్,జి దశరథం, డి రాజయ్య,ఎస్ సిద్ధిలింగం, డి రజిత విజయ్ కుమారి, బి సంధ్యారాణి




,ఎం శివుడు, ఎం ఎల్లయ్య,డి వెంకటయ్య,ఎస్ జైపాల్ రెడ్డి,జి సుజాత, పి నర్సింలు,వెంకటేష్,బాలరాజు,మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## నాయి బ్రాహ్మణ వృత్తికి పేటెంట్ కల్పించాలి

**జిల్లా ఇన్చార్జిమంత్రికి వినతి పత్రం అందించిన నాయి బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు**

**సిద్దిపేట, జులై 22:**

నాయి బ్రాహ్మణ సంస్కృతి సాంప్రదాయాలు కాపాడుతూ తమ వృత్తి తామే చేసుకునేలా నాయి బ్రాహ్మణులకు పేటెంట్ హక్కు కల్పించాలని సిద్దిపేట జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని కోరారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్లో మంత్రిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి పుట్టుక నుంచి చనిపోయేంత వరకు నాయి బ్రాహ్మణులు పాత్ర లేనిది ఎటువంటి కార్యక్రమం లేదన్నారు. కాన్పులు చేయడం, పురుడు పోయడం, కాళ్ళ గోర్లు తీయడం, పెళ్లిలో మైల పోలు తీయడం, కర్మకాండ చేయడం, దేవాలయాల్లో సన్నాయి వాయిద్యాలు వాయించడం, దేవుని ముందు కాగడాలు పట్టడం, వైద్యం చేయడం వంటివి తరతరాలుగా నాయి బ్రాహ్మణ వృత్తిలో భాగంగా కొనసాగుతూ వస్తున్నాయని తెలిపారు. ఈ వృత్తులను చేసుకునే విధంగా తమకు పేటెంట్ కల్పించాలని, ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో వేముల కుమార్, సింగిరాల శ్రీనివాస్,అల్వుల స్వామి, కోత్వాల్ విజయ్ కుమార్, బండారు సత్యనారాయణ, కొండూరు సతీశ్, జంపాల సంజీవ్, జంపాల విజయ్ కుమార్, జక్కనపల్లి రాము, పయ్యావుల తిరుపతి, పయ్యావుల వెంకట్, పయ్యావుల శివ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన కత్తి కార్తీక గౌడ

**దుబ్బాక, సిద్దిపేట పవర్ న్యూస్ జులై:22 ప్రతినిధి**

దుబ్బాక మున్సిపాలిటీ 3వ వార్డు చేల్లాపూర్ వార్డుకు చెందిన నిరుపేద కుటుంబావాసి కంకణాల రవి పొలం పని చేస్తుండగా పాము కాటుకు గురై మరణించడం జరిగింది.మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు పెద్ద కూతురు సంజన 8 సం" 2. చిన్న కూతురు సంజశ్రీ 18 నెలలు.ఉన్నారు.ఈ సమాచారం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక గౌడ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.అనంతరం టీమ్ కార్తిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్తీక తోబుట్టు కార్యక్రమం ద్వారా వారి పిల్లలకు 5,000 వేల రూపాయల పోస్టల్ ఫిక్స్ డిపాజిట్ బాండ్ అందజేయడం జరిగింది. ఎవరకి కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా అందించారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ 2వ వార్డ్ కౌన్సిలర్ దేవలక్ష్మి సంజీవ్ రెడ్డి, వేణుగోపాల స్వామి టెంపుల్ చైర్మన్ కనకాల దేవయ్య, సీనియర్ నాయకులు కొత్తది ఎవ రెడ్డి దుబ్బ రాజాగౌడ్ పరుశురాములు, 2వ వార్డ్ యూత్ ప్రెసిడెంట్ షాదుల్లా, మహేందర్ రెడ్డి,కనకాల చంద్రశేఖర్, రుద్రారం నవీన్, కామోజీ అనురాధ,తదితరులు



## దుక్కి దున్నిన ఎస్సై

**జనగామ జూలై 22 (సిద్దిపేట పవర్)**

జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో రెండో ఎస్సై గా విధులు నిర్వహిస్తున్న లింగారెడ్డి తనలో ఉన్న రైతును బయటకు తీసి ఉద్యోగ నిర్వహణలో గూడూరు వెళ్లి పాలకుర్తి పోలీస్ స్టేషన్కు తిరిగి వెళుతున్న క్రమంలో మార్గ మధ్యలో ఒక రైతు తన పత్తి చేనులో ఎద్దులతో అరక దున్నడం చూసి ఉద్యోగం రాకముందు తాను కూడా ఒక రైతుని అని, నేను వ్యవసాయం చేశాను అని, రైతు దుక్కి దున్నడం చూసి నాలో ఉత్సాహం వచ్చి గత స్మృతులను నెమరు వేసుకుంటూ ఎద్దులతో పత్తి చేనులో దుక్కి దున్నారు.

ఈ సంఘటన చూసిన ఆ రైతు ఎస్ఐ లింగారెడ్డి చలక దున్నడం చూసి మీకు కూడా ఈ ఇలాంటి పనులు వస్తాయా సార్ అని ఎస్సై లింగారెడ్డిని మెచ్చుకున్నారు..



## చేర్యాల డివిజన్ కోసం 25న జరిగే బంద్ ను విజయవంతం చేయండి

- **జేఏసీ చైర్మన్ డా. ఆర్ పరమేశ్వర్**
- **జేఏసీ కార్యాలయంలో బంద్ కరపత్రాలు ఆవిష్కరణ**

**చేర్యాల, జూలై 22 (సిద్దిపేట పవర్)**

చేర్యాల డివిజన్ సాధన కోసం ఈనెల 25న జరిగే బంద్ ను విజయవంతం చేయాలని చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ పిలుపునిచ్చారు. ఈనెల 25న తలపెట్టిన బంద్ కు సంబంధించిన కరపత్రాలను మంగళవారం కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ చైర్మన్ డాక్టర్ పరమేశ్వర్ మాట్లాడుతూ.. చేర్యాల రెవెన్యూ డివిజన్ గురించి ఈనెల 25న చేపట్టే నాలుగు మండలాల బంద్ విజయవంతం చేయాలని కోరారు. గత ఎన్నికల్లో రెవెన్యూ డివిజన్ అంశం గురించి జనగామలో జరిగిన సభలో నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని అధికారంలోకి వచ్చిన ఒక నెలలోనే రెవెన్యూ డివిజన్ ను ప్రకటిస్తామని అన్నారు. ఇప్పటికైనా 2025 డిసెంబర్ లోపే రెవెన్యూ డివిజన్ ను ప్రకటించాలని అందుకే ఈనెల 25న 4 మండలాల బందు నిర్వహిస్తున్నామని అన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ అంశం చేర్యాల ప్రాంతానికి భౌతిక పరమైన అంశమే కాదు చేర్యాల ప్రాంత ప్రజల చిరకాల కోరిక చేర్యాల ప్రాంత ప్రజల అస్తిత్వం ఉనికి ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్నది కాబట్టి ఎవరు ఏ రూపంలో జేఏసీలు ఏర్పాటుచేసిన ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి భాగస్వాములు అవుతున్నారన్నారు. గత పది సంవత్సరాల నుండి రెవెన్యూ డివిజన్ జేఏసీ ఆధ్వర్యంలో అన్ని రకాల పార్టీలు జేఏసీలతో మమేకమై పోరాడుతున్నాయని అన్నారు. ఈనెల 25న తలపట్టే బంధు ద్వారా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి తమ ప్రజల యొక్క రెవెన్యూ డివిజన్ ఆకాంక్షను తెలియజేస్తామని అన్నారు. 25న జరిగే బంధు కోసం సిపిఐ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, న్యూడెమోక్రసీ ,ఆర్ఎస్పి, బీఎస్పీ, మాల మహానాడు, ఎమ్మార్పీఎస్, విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం, వివిధ కుల సంఘాలు, యువజన సంఘాలు, అందరూ స్వచ్ఛందంగా తమ మద్దతును తెలియజేసి బందును విజయవంతం చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో జేఏసీ నాయకులు అందె అశోక్, అందె బీరయ్య, బుట్టి సత్యనారాయణ, సనవాల ప్రసాద్, ఈరి భూమయ్య, జంగిలి యాదగిరి, వలబోజు నర్సింహ చారి, పొన్నబోయిన మమత, పోలోజు వెంకటాద్రి, ఎక్కలదేవి సుధాకర్, నంగి కనకయ్య, పోనుగోటి శ్రీనివాస్ రెడ్డి, సిద్దిరాం భద్రయ్య, పొన్నబోయిన శ్రీనివాస్, నర్సిరెడ్డి, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర బృందం (ఎన్ ఎల్ ఎం) స్కీమ్ కేంద్ర పథకాలు అమలు కావాలని అధికారుల పర్యటన

**కొమురవెల్లి జులై 22 (సిద్దిపేట పవర్)**

కొమురవెల్లి మండలములోని ఐనాపూర్ గ్రామములో(NLM) కేంద్ర బృందం తేదీ.22.07. మంగళవారం నాడు సందర్శించింది.కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు,పేదరిక నిర్మూలన చర్యలు స్వయం ఉపాది రుణాలు తీసుకున్న మహిళా సంఘాల సభ్యులతో ఆర్థికంగా బాగు పడలాని చెప్పినారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ఎలా చేపడుతున్నారు వారికి ప్రభుత్వం ఇచ్చే ఐదు లక్షలతో ఇండ్లు నిర్మించుకోవాలని మీరు ఇంటి నిర్మాణానికి అప్పులు చేయద్దనే ప్రభుత్వం 5.00 లక్షలు ఇస్తున్నారన్నారని లబ్దిదారులకు చెప్పినారు.ఉపాధి హామీ పనులలో భాగంగా వ్యవసాయ భూముల దగ్గరికి రోడ్లు, పౌల్ట్రీ ఫారములు, గుట్టలకు కంటూరు కందకాలు, నర్సరీలు సందర్శించినారు. సి.సి రోడ్డు పనులు, చేయూత పెన్షనులు, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి బాల బాలికలతో పౌష్టికాహారము పై మాట్లాడినారు. ఇతర పలు అభివృద్ది పనులపై కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలు ఎలా అభివృద్ధి అవుతున్నారనే అంశాలపై చర్చించినారు. గ్రామ పం కార్యాలయము ప్రక్కన డ్వాక్రా గ్రూప్ మహిలతో మొక్కలను నాటా రు.ఐకేపీ శ్రీనివాస్ రెడ్డి గారలను బృందం సన్మానం చేసినారు.వారు మాట్లాడుతూ ఎంపీడీఓ కొమురవెల్లి గారి సమన్వయము బాగుంది మాకు చాలా సహకరించారని కొనియాడారు.ఈ కార్యక్రమములో కేంద్ర బృంద సభ్యులు శ్రీ జోస్లీ జోసెఫ్, వినోద్ గారలు, Addl డిఆర్డిఓ శ్రీనివాస్ గౌడ్, ఎంపిడిఓ వి.శ్రీనివాస్ వర్మ, పిఆర్ ఏఈ శివకుమార్,ఏపిపఓ జి.బాల లింగం గుప్తా, ఎంఈఓ రమేశ్, గ్రామ ప్రత్యేక అధికారి Dy తహశీల్దార్ వేణు గోపాల్, సిబ్బంది, ఏఈ హౌసింగ్ మేఘన, ఐ కే పి ఏ పి ఎం.శ్రీనివాస్ రెడ్డి, ఐ సి డి ఎస్ సూపెర్వైజర్, హెల్త్ డిపార్ట్మెంట్,స్థానిక పంచాయితీ కార్యదర్శి బాలనర్సయ్య గ్రా,పం,సిబ్బంది అంగన్వాడీ టీచర్లు ఆశావార్కర్లు డ్వాక్రా గ్రూప్ మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు





# విద్యాసంస్థల బంద్ కు మద్దతు

**గజ్వేల్ మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు పంగ మోహన్ బాబు**



**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం:** ఈ నెల 23న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్లు, కాలేజీల బంద్ కు పిలుపునిచ్చిన విద్యార్థి సంఘాలకు మద్దతుగా గజ్వేల్ మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు పంగ మోహన్ బాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావొస్తున్న విద్యార్థుల సమస్యలు పట్టించుకొక పోవడం హాస్టళ్లలో కనీస మౌలిక సదుపాయలు లేక విద్యార్థులు పడుతున్న బాధ ఈ కాంగ్రెస్ కండ్లకు కనబడక పోవడం ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఈ ప్రభుత్వం పట్టించుకోకపోవడం రెండు సంవత్సరాలుగా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం గత ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్ మీ పేరిట గొప్పలు చెప్పుకొని నేటికీ టీచర్, యంఈవో, డిఈవో పోస్ట్ ల భర్తీ చేయకపోవడం స్కాలర్షిప్, రియంబర్స్మెంట్ విడుదల పెండింగ్ ఉండడం సంవత్సరానికి 2 లక్షల ఉద్యోగాలు, యూనివర్సిటీ డెవలప్మెంట్ కాలేజీ లలో మధ్యాహ్నం భోజనం ఉచిత బస్ పాస్ లు ఇలా 100 సమస్యల పై డిమాండ్ చేస్తు రేపు బందుకు పిలునిస్తున్నాం.

# గజ్వేల్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలి

- జర్నలిస్టులకు అన్యాయం జరిగితే సహించేది లేదు
- జర్నలిస్ట్ కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం అందించాలి
- జర్నలిస్ట్ పిల్లలకు ఉచిత విద్యను అందించాలి
- రాష్ట్రంలోని ప్రతి జర్నలిస్టుకు మద్దతుగా టీజేయు ఉంటుంది
- తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం:** గజ్వేల్ లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో మంగళవారం రోజు సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మరాటి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గజ్వేల్ లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలని, జర్నలిస్టులకు అన్యాయం జరిగితే సహించేది లేదని, జర్నలిస్టుల కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం అందించాలని వారి పిల్లలకు ఉచిత విద్యను అందించాలని, రాష్ట్రంలో ప్రతి జర్నలిస్టుకు మద్దతుగా తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ ఉంటుందని, రాష్ట్రంలో చిన్న పత్రిక నుంచి మొదలు పెడితే పెద్ద పత్రిక వరకు ఏ ఒక్క జర్నలిస్ట్ కైనా సమస్య వస్తే తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కరించేందుకు రాష్ట్ర అధ్యక్షులు కప్పర ప్రసాద్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సమస్యను పరిష్కరించే దిశగా ముందుంటారని గుర్తు చేస్తున్నామన్నారు. అనంతరం సిద్దిపేట జిల్లా తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మరాఠీ కృష్ణమూర్తి మాట్లాడుతూ గజ్వేల్ లో పనిచేస్తున్న విలేకరులకు జర్నలిస్ట్ కాలనీలో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకుంటే వాటిని ఇతర యూనియన్ లో పనిచేస్తున్న జర్నలిస్టులు అడ్డుకోవడం విచిత్రంగా ఉందన్నారు. జర్నలిస్టుకు సమస్య వస్తే ప్రశ్నించాల్సింది పోయి వారే అడ్డుకోవడం సరైన చర్య కాదన్నారు. ఈ విషయం పై రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని, త్వరలో జర్నలిస్టు ఇళ్ల స్థలాల గురించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గజ్వేల్ జర్నలిస్టులకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ చంద్రశేఖర్ చారి, సిద్దిపేట జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీకాంత్ చారి, జిల్లా కార్యవర్గ సభ్యులు గుడాల చంద్రశేఖర్ గుప్తా, ఎల్లం రాజ్, మహేష్, బైరి ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



# కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వం

- స్థానిక ఎన్నికల్లో ఆరు గ్యారంటీలే పార్టీ నీ గెలిపిస్తాయి
- కాంగ్రెస్ పార్టీలో చేరిన BRS వార్డ్ మెంబర్లు,నాయకులు
- చిన్నకోడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్

**సిద్దిపేట పవర్ సిద్దిపేట జూలై 22**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలు సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా పాలన అభివృద్ధికి ఆకార్షిత్ లై చిన్నకోడూరు మండలం చౌడరాం తాజా మాజీ వార్డ్ మెంబర్లు, చిన్నకోడూర్ మండల బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి మరియు brs నాయకులు చిన్నకోడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ సమక్షంలో కార్మిక & మైనింగ్ శాఖ, మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనాలో అమలవుతున్న ఆరు గ్యారెంటీలు,అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం బీసీ లపై చిత్తశుద్ధి తో 42% రిజర్వేషన్, అదేవిధంగా దేశ చరిత్రలో ఏ పార్టీ చేయనివిధంగా ఏస్సీ వర్గీకరణ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి కి దక్కుతుందన్నారు రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు చిన్నకోడూరు మండలం చౌడారం తాజా మాజీ వార్డ్ మెంబర్ బి ఆర్ ఎస్ నాయకులు ఎదుగాని లహరి శ్రీనివాస్, ఎల్లమ్మ జాలుకు చెందిన తాజా మాజీ వార్డ్ మెంబర్ కొరవేణి యాదగిరి,brs పార్టీ చిన్నకోడూరు మండల బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మేడోజు దుర్గ చారి,నాయకులు కొరవేణి కనకయ్య, నరేష్, పెద్ద రాజు తదితరులు పెద్ద ఎత్తున పార్టీ లో చేరారు ఈ కార్యక్రమం లోకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మీసంమహేందర్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ కొమ్ము ప్రశాంత్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు ఉడుత ప్రశాంత్, ఎస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షులు నమండ్ల వినోద్, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు ఉడుత జయంత్, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి పాకాల భూపతిరెడ్డి, రాజవర్ధనరెడ్డి, గొట్టి పర్తి చందు, నరేష్ రాజు,నక్క రాజు, కొమ్ము ఎల్లయ్య, తదితరులు పాల్గొనడం జరిగింది



# ప్లాస్టిక్ రహిత సిద్దిపేటపై దృష్టి సారించండి





- బ్లాక్ స్పాట్స్ లను అరికట్టండి
- సీజనల్ వ్యాధులపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి
- స్వచ్ఛ సిద్దిపేటకు అందరూ సహకరించాలి
- నిర్లక్ష్యం వహిస్తే...చర్యలు తప్పవు
- సిద్దిపేట మున్సిపల్ చైర్పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు

**సిద్దిపేట పవర్:22 జులై 2025**

సిద్దిపేట పురపాలక సంఘం కార్యక్రమంలో ఈరోజు మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు తో కలిసి పట్టణ ఆర్పీలతో సమావేశాన్ని నిర్వహించిన సిద్దిపేట మున్సిపల్ చైర్పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు ఈసందర్భంగా మాట్లాడుతూ.. సిద్దిపేట పట్టణం అందమైన పట్టణమని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంటుందని అన్నారు. పట్టణంలో ఆరుబయట చెత్త వేయడం రోజురోజుకు పెరిగిపోతోందని ,ఆరుబయట చెత్త వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని అన్నారు. ప్రతిరోజూ ఉదయం వార్డు ఆఫీసర్లు మరియు వార్డు అర్పిలు కచ్చితంగా చెత్త బండితో కలియతిరగలని అన్నారు సిద్దిపేట పట్టణంలో బ్లాక్ స్పాట్స్ తొలగించడంలో మున్సిపల్ సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.బ్లాక్ స్పాట్స్ రహిత సిద్దిపేటకు అందరూ కృషి చేయాలని అన్నారు.వార్డు ఆఫీసర్లు,అర్పిలు వార్డులలో కలియతిరుగుతూ చెత్త బండికి చెత్తను అందించని వారిని గుర్తించి మందలించాలని అన్నారు. దీని కోసం మున్సిపాలిటీలో ప్రత్యేక టీమ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. సిద్దిపేట పట్టణానికి వలస వచ్చినటువంటి ప్రజలందరికీ చెత్తను వేరు చేయడం పట్ల అధికారులు అవగాహన కల్పించాలని అన్నారు. చెత్తను కచ్చితంగా తడి, పొడి మరియు హానికరమైన చెత్తగా వేరు చేసి కేవలం



చెత్త బండికి మాత్రమే అందించాలని అన్నారు. సిద్దిపేట అభివృద్ధికి మరియు స్వచ్ఛ సిద్దిపేటకు పాలకవర్గం ఎప్పుడు ముందుటుందని అన్నారు. వర్షాకాలం కావున సీజనల్ వ్యాధులపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ వాడకం ఎక్కువైందని దానిని పూర్తిగా అరికట్టాలని అన్నారు. ప్రజలు జ్యూట్ బ్యాగ్ లను వినియోగించాలని అన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు జ్యోతి, రేణుక, శిరీష, పట్టణ అర్పిలు పాల్గొన్నారు.



# సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంను సందర్శించిన ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకట్ స్వామి

**ఘనంగా స్వాగతం పలికిన సిద్దిపేట నియోజిక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ**

**సిద్దిపేట పవర్ సిద్దిపేట జూలై 22:**

సిద్దిపేట నియోజకవర్గం ప్రజలకు, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకట్ స్వామి కాంగ్రెస్ శ్రేణులకు భరోసా నిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని తెలిపారు. మంగళవారం ఉదయం కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకట్ స్వామి ని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం లో సిద్దిపేట నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ సాధారంగా ఆహ్వానించి ఘనంగా సన్మానం చేశారు. ఆలాగే కార్యకర్తలతో మాట ముచ్చట మాట్లాడి చిన్న కోడూరు,నంగునూర్ నుండి బి ఆర్ ఎస్ కార్యకర్తలను పార్టీలో చేర్చుకొని మీ స్థానిక ఎన్నికలకు నేను భరోసా.! అని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి సమస్యలు, వివిధ రెసిడెన్షియల్ స్కూళ్లలో భోజన, వసతుల పై వనమహోత్సవం, తదితర అంశాలపై మాట్లాడి ఇప్పటికి బి ఆర్ ఎస్ పార్టీ కి అనుకూలంగా పని చేస్తున్న అధికారులపై చర్యలు తప్పవని వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు .నా దృష్టికి తీసుక వస్తే సస్పెండ్ చేస్తానని తెలిపారు, ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంప మహేందర్ రావు,కలీముద్దీన్,బొమ్మల యాదగిరి,మార్క సతీష్,దాస అంజన్న,కౌన్సిలర్స్ పయ్యావుల ఎల్లం యాదవ్,సాకి ఆనంద్, మండల అధ్యక్షులు తప్పట శంకర్,మీసం మహేందర్,రాములు,అంజిరెడ్డి,బిక్షపతి,షాబుద్దీన్,పూజల గోపిక్రిష్ణ, వహీద్ ఖాన్, డీసీసీ మహిళా అధ్యక్షులు ముద్దం లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు సందీప్ యాదవ్, వాహబ్,గాయశుద్దీన్,రషద్,ఎర్ర మహేందర్,కొత్త మహిపాల్ రెడ్డి,అర్షద్,మున్నా,మేరుగు రాజు,బండి శివకుమార్,కరుణాకర్ భాగన్న,అతిక్,వెంకటేశ్వర ఆలయ డైరెక్టర్స్ ఉప్పరెట్ల సంతోష,బూర శ్రీనివాస్ గౌడ్,అంజిరెడ్డి,అశోక్,వంశీ,సాయిప్రతాప్,జనార్ధన్ రెడ్డి,రూరల్ అర్బన్ టౌన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.






# ఘనంగా దాశరథి శతజయంతి వేడుకలు

- సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎదిరించాలి
- చైతన్యాన్ని దాశరథి నుండి నేటి విద్యార్థులు అందిపుచ్చుకోవాలి
- కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ ఎస్ గణపతి రావు

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి జూలై:22** నా తెలంగాణ కోటి రతనాల వీణ అని ఎలుగెత్తి చాటిన దాశరథి కృష్ణమాచార్యుల శతజయంతి వేడుకలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయంకృత్పత్తి గజ్వేల్ తెలుగు విభాగం వారు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల చేత దాశరథి జీవితము సాహిత్యము అనే అంశంపై పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వహించారు. దాశరథి రచనా విశేషాలు జీవిత విశేషాలను పొందిన పురస్కారాలను, సమాజాన్ని చైతన్యపరిచిన కవితా పంక్తులను, సినీ గేయ విశేషాలను గురించి విద్యార్థులు ఉత్సాహంగా పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వహించారు. శతజయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ ఎస్ గణపతి రావు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ధిక్కారస్వరంగా, నిజాం నిరంకుశత్వాన్ని నిరసించిన అభ్యుదయ వాదిగా పేరుగాంచిన దాశరథి కవిత్వంలో ప్రజా చైతన్యం ప్రకృతి సౌందర్యం సమానంగా ఉంటాయని తెలియజెప్పారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎదిరించాలని చైతన్యాన్ని దాశరథి నుండి నేటి విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఆర్ మహేందర్ రెడ్డి, డాక్టర్ ఎస్ మహేందర్,ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

